ప్రజాశక్తి

సోమవారం 17 జూన్ 2024

5

పార్వతీపురం మన్యం



మంత్రిని కలిసిన బేబినాయన

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని ఆదివారం పార్వతీ పురం ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబి నాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మ నాయుడు వారి అనుచరులతో కలిసి మంత్రిని కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి అభినందిస్తున్న బేబినాయన

చదువు దూర, భారం

మూతపడ్డ ఎయిడెడ్ పాఠశాలలు
చిన్నారులకు తప్పని అవస్థలు
ఆందోళన చేసినా పట్టించుకోని అధికారులు

ఏజెన్సీలో విద్యకు ప్రాధాన్యత ఇస్తామని ప్రభుత్వాలు ఒకవైపు ప్రకటనల చేస్తున్నా అది కార్యరూపం దాల్చడం లేదు. గ్రామాల్లో పాఠశాలల్లేక చిన్నారులు చదువుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. ఈ సమస్య గత కొన్నేళ్లుగా ఉన్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో గిరిజన విద్యార్థులకు విద్య అందని ద్రాక్ష గానే మారింది.



పి. ఆమిటి లో మూతపడ్డ ఎయిడెడ్ పాఠశాల

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని పి.ఆమిటి, దుమ్మంగి, బొద్దిడి గ్రామాల్లో చిన్నారులకు చదువు దూర భారంగా మారింది. ఈ గ్రామాల్లోని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసిన ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేయడంతో వారి స్థానంలో ప్రభుత్వం కొత్తవారిని నియమించలేదు. దీంతో ఒక్కొక్క పాఠశాల మూతపడుతున్నాయి. దీంతో ఇక్కడ విద్యార్థులకు చదువు అందని ద్రాక్షగా మారింది. తమ పిల్లల్ని బాగా చదివించి ఉన్నత స్థాయిలో ఉంచాలనే ఉద్దేశంతో పది కిలోమీటర్ల దూరంలో ఉన్న గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రానికి పంపిస్తున్నారు. ఉపాధ్యాయులను నియమించి తమ పిల్లలకు స్థానికంగా చదువులు అందించాలని పి.ఆమిటి సర్పంచి తాడంగి దమయంతి ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేసినా ప్రభుత్వం, అధికారులు కనీసం పట్టించుకోలేదు. మరోవైపు దుమ్మంగి సర్పంచి పాలక క్రాంతికుమార్ పాఠశాల ఏర్పాటు కోసం ఐటిడిఎ, మండల విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా హామీ ఇచ్చారే తప్ప పాఠశాల ఏర్పాటు చేయలేదు. దుమ్మంగి గ్రామ విద్యార్థులు, తల్లిదండ్రులు సచివాలయం ఎదుట ఎన్నోసార్లు ధర్నాలు చేపట్టారు. స్పందన మాత్రం శూన్యం. దీంతో గత కొన్నేళ్లుగా విద్యార్థులు చదువుకునేందుకు ప్రతిరోజూ ఆర్‌టిసి బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో బయట ప్రాంతాలకు వెళ్లి వస్తున్నారు. ఎండకు, వర్షానికి ఇబ్బందులు పడుతూ చదువులు సాగించాల్సి వస్తుందని, ఇంటి నుంచి వెళ్లిన తమ బిడ్డ క్షేమంగా వస్తాడో రాడోనన్న భయంతో ఎదురుచూడాల్సి వస్తుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చదువుకోడానికి సుదూర ప్రాంతాలకు వెళ్తున్న దుమ్మంగి చిన్నారులు

ఉపాధ్యాయులను నియమించాలి

మండలంలోని దుమ్మంగిలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు స్థానికంగా చదువులు చెప్పాలి. గత పదేళ్లగా గ్రామంలో పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు బయట ప్రాంతాలకు చదువుకోడానికి వెళ్లాల్సి వస్తుంది. దీంతో అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

పాలక క్రాంతికుమార్,
సర్పంచి, దుమ్మంగి.

పాఠశాలలు కొనసాగించాలి

మండలంలోని దుమ్మంగి, పి.ఆమిటి గ్రామాల్లో గల ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించి పాఠశాలలను కొనసాగించాలి. గ్రామాల్లో పాఠశాలలు లేకపోతే చిన్నారులు చదువుకు దూరమై డ్రాప్ అవుట్‌గా మారే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించి గిరిజన విద్యార్థులకు స్థానికంగా విద్యా అందించాలి.

కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి.

యువతలో స్కిల్స్‌ను గుర్తించేలా

నైపుణ్య సూచికలు

- పరిశ్రమల ఏర్పాటులో సాయపడేందుకు వేదిక ఏర్పాటు
- చిన్న పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ఘన స్వాగతం పలికిన అధికారులు, నాయకులు

ప్రజాశక్తి- విజయనగరం కోట

రాష్ట్రంలో యువతలో ఉన్న నైపుణ్యాలను గుర్తించి, ఏ తరహా స్కిల్ కలిగిన వారు ఏ ప్రాంతంలో ఎంత సంఖ్యలో అందుబాటులో ఉన్నారో తెలిపేలా నైపుణ్య సూచికలను రూపొందించనున్నట్టు చిన్నతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. దీనివల్ల ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తమ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యత గల మానవ వనరులు ఎక్కడ అందుబాటులో ఉన్నదీ తెలుసుకొంటారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం జిల్లాకు తొలిసారిగా ఆదివారం విచ్చేసిన శ్రీనివాస్‌కు జిల్లా అధికారులు, టిడిపి, జనసేన నాయకులు ఘనస్వాగతం పలికి, అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా నగరంలో అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయనగరం, బొబ్బిలి ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, బేబినాయనతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని యువతలో నైపుణ్యాలను పెంపొందించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు లేని పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. ఉద్యోగ కల్పనపైనే అధికంగా దృష్టిసారిస్తామన్నారు. గత ఐదేళ్లలో పారిశ్రామికాభివృద్ధి కుంటుపడిందని, ఔత్సాహికులు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే పరిస్థితులు కల్పించలేదని చెప్పారు. ఏ జిల్లా ఎలాంటి పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందో పారిశ్రామిక వేత్తలకు తెలియజేసి, ఆయా జిల్లాలో ఆ తరహా పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తామని వెల్లడించారు. విజయనగరంలోనూ ఏ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయో గుర్తిస్తామన్నారు. ఔత్సాహికులకు అవసరమైన సమాచారాన్ని, ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలు, ఇతర సలహాలు అందజేసి వారు పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో తగిన సహకారం అందించేందుకు ఒక వేదిక ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం చిన్నపరిశ్రమలకు ఇచ్చే ప్రోత్సాహకాలు, వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు అందించేలా వేదిక ద్వారా సహకారం అందిస్తామన్నారు. అంతా సమిష్టిగా పనిచేసి జిల్లాను, రాష్ట్రాన్ని ఒక దారిలో పెట్టాల్సి ఉందన్నారు. విదేశాల్లోని ఆంధ్రుల సమస్యలను పరిష్కరించడంతోపాటు వారితో ఇక్కడ పెట్టుబడులు పెట్టించేందుకు ప్రయత్నాలు చేస్తామన్నారు.



విలేకుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

కార్యక్రమంలో మాజీ ఎంపిపి కొండపల్లి కొండబాబు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, జొన్నవలస ఎంపిటిసి రాజేష్‌బాబు, టిడిపి నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, కంది మురళి నాయుడు, పిల్లా విజయ్, అవనాపు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొండపల్లికి అభినందనల వెల్లువ

మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. జిల్లా పరిషత్తు అతిథి గృహంలో ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, సిబ్బంది, నాయకులు పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. ముందుగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.. మంత్రి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి సంధ్యారాణికి సమస్యలను వివరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ముడుపులు తీసుకున్న వారిపై చర్యలేవీ?

మంత్రికి యుటిఎఫ్ నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ఐటిడిఎ పరిధిలో సిఆర్‌టిల క్రమబద్ధీకరణకు సంబంధించి ముడుపులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవడంలో పిఒ విష్ణు చరణ్ తాత్సారం చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారుల ఒత్తిళ్ల వల్లనే చర్యలు తీసుకోవడానికి జాప్యం చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వం హయాంలో ఎన్నికల ముందు సిఆర్టీల క్రమబద్ధీకరణ చేయాలని జీవో విడుదలైంది. దీనిలో భాగంగా పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో అర్హులైన 130 మంది సిఆర్టీల క్రమబద్ధీకరణ జరిగింది. అయితే వారి క్రమబద్ధీకరణ చేయడానికి గిరిజన సంక్షేమ అధికారి, ప్రాజెక్టు కార్యాలయం అధికారి కలిసి సిఆర్టీల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు అప్పట్లో గుప్పుమన్నాయి. ఒక్కో సిఆర్టీ నుంచి లక్ష నుంచి లక్షన్నర వరకు లంచాలు తీసుకున్నారనే ఆరోపణలు వినిపించాయి. ఈ వసూళ్లు చేయడానికి నాయకత్వం వహించిన నలుగురు సిఆర్టీల ఫోన్ పే, బ్యాంక్ ఖాతాల ద్వారా లంచాలను పంపించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ విచారణకు ఆదేశించారు. ఇది జరిగి రెండు నెలలైనా ఇంతవరకు అతీగతీ లేదు. ఈనెల 4 వరకు ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ ఎన్నికల ప్రక్రియలో తలమునకలై ఉన్నారు. ఈ ప్రక్రియ ముగిసి రెండు వారాలైనా ఇంతవరకు చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. త్వరలో రాష్ట్రంలో ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల బదిలీలు జరగనున్నాయి. అంతవరకు కాలయాపన చేసి ఈ వ్యవహారాన్ని పక్కతోవ పట్టించాలనే ప్రయత్నంలో జిల్లా అధికారులు వున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు తోట రమేష్ ఆధ్వర్యాన సంఘం నాయకులు ఎ.సీతయ్య, ఎస్.సింహాచలం ఆదివారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని ఆమె నివాసంలో కలిశారు. సిఆర్టీల క్రమబద్ధీకరణకు సంబంధించి ముడుపులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, అక్రమ గ్రేడ్ -2 హెచ్ఎం ప్రమోషన్ రద్దు చేయాలని, 2024-25 సంవత్సరానికి సంబంధించి సిఆర్టీల, భాషా వాలంటీర్లను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. యుటిఎఫ్ నాయకులు చెప్పిన సమస్యలను విన్న మంత్రి సంధ్యారాణి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఎంఇఒల సమస్యలు పరిష్కరించాలి


తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంఇఒల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం, జిల్లా అధ్యక్షులు జోగారావు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి

కురుపాం, గుమ్మలక్ష్మీపురంలో బ్లడ్ బ్యాంకులు నెలకొల్పాలి
ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గంలో గల గిరిజన గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గిరిజనులు మలేరియా, డెంగీ బారిన పడకుండా వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, కోశాధికారి మండంగి రమణ డిమాండ్ చేశారు. ఆదివారం వారు స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. గిరిజన గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రస్తుతం మలేరియా స్ప్రేయింగ్ చేస్తున్నారని, అయితే ఇది ఆలస్యంగా చేపట్టడంతో ఇప్పటికే అనేక మంది గిరిజన గ్రామాల్లో ప్రజలు మలేరియా, డెంగీ బారిన పడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొందరు చికిత్స పొందుతున్నారని అన్నారు. రోగులకు సరిపడా బెడ్లు ప్రభుత్వాసుపత్రుల్లో లేక కొంతమంది ఆర్ఎంపి వైద్యుల వద్ద, ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ వేలకు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. కావున ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే ప్రతి గిరిజన గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసి దోమతెరలు పంపిణీ చేసి గిరిజనులు మలేరియా, డెంగీ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే గిరిజన గ్రామాల్లో గల గర్భిణిలు, బాలింతలు అనేకమంది ప్రజలు రక్తహీనతతో బాధపడుతూ మృతి చెందిన సంఘటనలు ఉన్నాయని అన్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినప్పుడు రక్త పరీక్షలు కూడా నిర్వహించి రక్తహీనత లేకుండా చూడాలన్నారు. అలాగే అత్యవసర సమయంలో రక్తం అవసరమైతే పార్వతీపురంలో తప్ప ఇంకెక్కడ దొరకడం లేదని, కావున కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో బ్లడ్ బ్యాంకులు ఏర్పాటు చేయాలని కోరారు. ఎంతోమంది యువత రక్తం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని దీన్ని వైద్య సిబ్బంది సద్వినియోగం చేసుకుంటే గిరిజన గ్రామాల్లో ప్రజలెవరూ రక్తహీనతతో బాధపడి మరణించే సంఘటన ఉండవని అన్నారు. కావున బ్లడ్ బ్యాంకులు, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు గంగునాయుడు

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి

జియ్యమ్మవలస : మండలంలోని గిరిజన ప్రాంతంలో మళ్లీ మలేరియా విజృంభిస్తోందని, దీనిపై వెంటనే జిల్లా వైద్యాధికారులు స్పందించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లి గంగనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం చినమేరంగి కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో జ్వర బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చినమేరంగి ఆస్పత్రిలో జ్వరాల బారినపడి గిరిజనులు, పేదలు బాధపడుతున్నారన్నారు. చినమేరంగి హాస్పటిల్‌లో 30 పడకలు వుంటే సుమారు 40 మంది వరకు రోగులున్నారన్నారు. ఒకే కుటుంబములో ఇద్దరు పిల్లలు చొప్పున హాస్పటిల్‌లో చేరారని అన్నారు. హాస్పటిల్‌లో సిబ్బంది సేవలు అందిస్తున్నప్పటికీ ఇంకా కొరతే ఉందన్నారు. మలేరియాకు సంబంధించిన మందులు, ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. అనేక ఏళ్లుగా మలేరియా గిరిజన ప్రాంతాన్ని పీల్చిపిప్పి చేస్తుందని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉన్న వారంతా ఆర్నాడ, వనజ, కొత్తవలస, కొత్తగూడ, చినదొడిజ తదితర గ్రామాల గిరిజనులు ఉన్నారని జియ్యమ్మవలస గిరిజన ప్రాంతంలో వనజ, టికెజమ్ములో మెడికల్ క్యాంపులు పెట్టి మలేరియాను నివారించాలని, వెంటనే దోమతెరలు పంపిణీ చేయాలని కోరారు. ఈ జ్వరాలపై కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారు దష్టి సారించాలని కోరారు. రోగులను పరామర్శించిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు భూతల మోహన్ రావు ఉన్నారు.



కొట్టుగుమ్మడ వద్ద కాలువలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

పేరుకే పంట కాలువలు

చుక్క నీరు రాని వైనం
ఏటా సాగునీటి కోసం రైతులకు అవస్థలు

ప్రజాశక్తి - వీరఘట్టం

రైతులకు విత్తనాలతో పాటు రాయితీపై వ్యవసాయ పరికరాలు, పూర్తిస్థాయిలో సాగునీటి సౌకర్యం కల్పిస్తామని సమయం వచ్చినప్పుడల్లా పాలకులు హామీలివ్వడమే తప్ప కనీస అవసరమైన సాగునీరందించడంలో విఫలమవుతున్నారని రైతులు విమర్శిస్తున్నారు. మండలంలోని కిమ్మి, కొట్టుగుమ్మడ, గడగమ్మ, పివిఆర్ పురం, నడుకూరు తదితర గ్రామాలకు తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ద్వారా ప్రతి ఏటా సాగునీరందకపోవడంతో కొంతమంది రైతులు వరుణ దేవునిపై ఆశలు పెట్టుకుని పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, అవకాశమన్న కొంతమంది రైతులు మోటర్ల సాయంతో పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ఉందని చెప్పుకోవడం తప్ప, దాని వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని రైతులు వాపోతున్నారు. ఐదేళ్లలో గత ప్రభుత్వం పంట కాలువలపై దృష్టి సారించకపోవడంతో పంటలపై పెట్టిన పెట్టుబడులు రాక పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులు శ్రేయస్సు కోసం పనిచేస్తుందా? లేదా గత ప్రభుత్వం లాగా పనిచేస్తుందా? అన్న ఆలోచన రైతుల్లో నెలకొంది.

ప్రయోజనం లేదు

ప్రతి ఏటా ఉపాధిహామీ చట్టం కింద లక్షలాది రూపాయలు వెచ్చించి పంట కాలువలో పూడికలు తొలగించడం జరుగుతుంది తప్ప ఎలాంటి ప్రయోజనం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు సాగు చేసుకునేందుకు సాగునీరందడం లేదని, లక్షలాది రూపాయలు వెచ్చించి పనులు చేయడం కూడా వృథా అవుతుందని రైతులు వాపోతున్నారు. ఏది ఏమైనా నడుకూరు, కిమ్మి కొట్టుగుమ్మడ, గడగమ్మ, పివిఆర్ పురానికి ప్రతిఏటా సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా పంటలు కాలువ మరమ్మతుల దృష్టిసారించాలని రైతులు కోరుతున్నారు.

వేగావతి ఉధృతి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఒడిశాలో వర్షాలతో వేగావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పారాది వంతెన వద్ద నిర్మించిన కాజ్‌వే (డైవర్షన్ రోడ్డు)పై నుంచి వరదనీరు ప్రవహించింది. దీంతో రోడ్డు మధ్యలో ఒక రంధ్రం ఏర్పడగా, మరోచోట రోడ్డు కిందకు జారింది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో రోడ్డుపై నుంచి వరదనీరు ప్రవహించడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన డిఎస్‌పి శ్రీనివాసరావు నదిని పరిశీలించి ప్రమాదాల నివారణకు వాహనాలను దారి మళ్లించారు. బొబ్బిలి నుంచి విజయనగరం వెళ్లే వాహనాలను బాడంగి, తెర్లాం, రాజాం మీదుగా పంపించారు. రామభద్రపురం నుంచి బొబ్బిలి వచ్చే వాహనాలను అదే రోడ్డు మీదుగా దారి మళ్లించారు. పారాది వంతెన కుంగి ఏడాదైనా నూతన వంతెన పనులు ప్రారంభించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నూతన వంతెన పనులు ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఈ ప్రభుత్వంలోనైనా

ఆస్పత్రి పనితీరు గాడిన పడేనా..

ప్రజాశక్తి-పాలకొండ

కొత్తగా ఏర్పడిన ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంలోనైనా స్థానిక ఏరియా హాస్పటల్‌లో వైద్యసేవలు మెరుగుపడతాయన్న ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సేవల విషయంలో మెరుగుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏదైనా అత్యవసర సమయంలో వెళ్లే రోగులకు ఇక్కడి ఏరియా ఆస్పత్రిలో వైద్యం ఎప్పుడూ అందడంలేదన్న విమర్శలు సర్వత్రా ఉన్నాయి. రోగి పరిస్థితి చూసి ధైర్యంగా వైద్యం చెయ్యాల్సిన డాక్టర్లే , రోగి బంధువులను భయపెట్టి వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌కు, లేకుంటే వేరే హాస్పిటల్‌కు రిఫర్ చేసేస్తారన్న అపవాదం మూట కట్టుకున్నారు. స్థానిక ఏరియా హాస్పిటల్ మీద అవగాహన ఉన్న ఏ ఒక్కరూ అత్యవసర సమయాల్లో తమ రోగులను ఇక్కడకు తీసుకురావడం లేదు. ఇక్కడకు తీసుకొని వెళ్లినా వెంటనే రిఫర్ చేయడం తప్ప వారు అందించే వైద్య సేవలేమీ ఉండవు. అందుకే ఇక్కడకు తీసుకొచ్చినా సమయం వృథా చేసుకునే బదులు మరో పెద్ద హాస్పిటల్‌కు తీసుకుని వెళ్లి ప్రాణం కాపాడుకుందామనే భావనతో అవగాహన ఉన్నవారెవరూ ఆపదలో ఉన్న తమవారిని ఇక్కడకు తీసుకురారు. అలా అని ఇక్కడ ఉన్న డాక్టర్లు ఎవరైనా కొత్తవారా అంటే కాదు. ప్రతి ఒక్కరూ ఆయా విభాగాల్లో మంచి నిష్ణాతులైన వైద్యులే. ఇంచుమించు ప్రతి డాక్టర్ పాలకొండలో సొంతంగా ప్రయివేటు హాస్పిటళ్లు నడుపుతున్నవారే. తమ హాస్పిటల్లో ఒకరకంగా, అదే ఏరియా హాస్పిటల్‌లో అయితే మరో రకంగా వీరు చికిత్స అందిస్తారనే భావన ప్రజల్లో ఉంది. ఇటీవలే ఒక వ్యక్తి అపస్మారక స్థితిలో స్థానిక ఏరియా ఆస్పత్రికి వెళ్తే ఆయన పరిస్థితి గమనించిన వైద్యబృందం ఈయన షుగర్ లెవెల్స్ 700కు చేరాయని, ఇక్కడ వైద్యం ఇవ్వలేమని చెప్పి కనీసం ఇన్సులిన్ కూడా ఇవ్వకుండా వారి ఇంట్లో వారిని కంగారుకు గురిచేశారు. దీంతో వెంటనే ఆ వ్యక్తిని విశాఖలోని ఓ ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించగా ఆ వ్యక్తి ఒక రోజు వ్యవధిలో డిశ్చార్జ్ అవ్వడం గమనార్హం. ఇలాంటి సంఘటనలు కోకొల్లలు. ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా స్థానిక ఎమ్మెల్యేనే ఉంటారు. ఈసారి ప్రస్తుత ఎమ్మెల్యే జయకృష్ణ హయాంలోనైనా హాస్పిటల్ పనితీరులో మార్పు రావాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల్లో విస్తతంగా తిరిగి వారి కష్టనష్టాలు తెలుసుకుని కష్టాల్లో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి తన తోడ్పాటు అందించారని పేరు తెచ్చుకున్న జయకృష్ణ ఇప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేగానూ, ఏరియా హాస్పిటల్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కావున ఆస్పత్రి పనితీరును మెరుగుపరుస్తారని నియోజకవర్గ ప్రజలు గంపెడాశలతో ఉన్నారు. వీరి ఆశలను ఎమ్మెల్యే ఏ మేరకు నెరవేర్చేందుకు ఆస్పత్రి పనితీరును గాడిలో పెడతారో వేచి చూడాల్సిందే.



కాలనీల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రాధాన్యత

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పట్టణంలోని అన్ని కాలనీలో మౌలిక వసతులు ఏర్పాటుకు తగిన ప్రాధాన్యం కలిగేలా కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శనివారం రాత్రి పట్టణ శివారు కాలనీ అయిన గణేష్‌నగర్ కాలనీవాసులు ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణం జిల్లా కేంద్రమైనప్పటికీ గత పాలకుల నిర్వాకం వల్ల పట్టణ పరిధిలో గల ప్రజలకు మౌలిక సదుపాయాల ఏర్పాటు తగినంతగా జరగలేదని, మున్సిపాలిటీలో నిధులు ఉన్నప్పటికీ ఖర్చు చేయడానికి ముందుకు రాకపోవడం వల్ల పట్టణంలోని అన్ని కాలనీలోనూ రహదారులు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్నప్పటికీ వారికి తగిన రీతిలో సదుపాయాలు కల్పించకపోవడం గత ప్రభుత్వ వైఫల్యం అని దీన్ని పాలకుల వైఫల్యంగా కూడా చెప్పవచ్చునని అన్నారు. టిడిపి హయాంలో పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దామని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, బార్నాల సీతారాం, బోను చంద్రమౌళి, రౌతు వేణుగోపాలరావు నాయుడు, గుండ్రెడ్డి రవికుమార్, బడే గౌర్నాయుడు, గణేష్ నగర్ కాలనీవాసులు, తల్లి పిల్లల ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జి.వాసుదేవరావు, డాక్టర్ శ్రీరేఖ దంపతులు, టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విజయంద్రను అభినందిస్తున్న గణేష్‌నగర్ కాలనీ వాసులు

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

పార్వతీపురం టౌన్ : పట్టణంలో గల లయన్స్ క్లబ్‌లో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా బిఎన్‌బి రావు, కార్యదర్శిగా పి.వెంకటప్రసాద్ (బుజ్జి), కోశాధికారిగా బలగ వెంకటనాయుడు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తతం చేయాలని, నూతన అధ్యక్షులు బిఎన్ బి రావు సారథ్యంలో ప్రతి పేదవారికి సేవలు అందాలని కోరారు. ఉత్తరాంధ్రలో గల ఈ క్లబ్ రెండో అతిపెద్దదని, లయన్స్ క్లబ్ కార్యవర్గంలో అనుభవజ్ఞులు, మేధావులంతా ఉన్నారని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే విజయ్ చంద్రకు లయన్స్ క్లబ్ సభ్యులు దుస్సాలువుతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బార్నాల సీతారాం, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



మంత్రి సంధ్యారాణిని కలిసిన టిడిపి మండల నాయకులు

మంత్రిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖమంత్రి గుమ్మిడి సంధ్యరాణి, బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయనను కురుపాం నియోజకవర్గం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, మండల పార్టీ అధ్యక్షులు పల్ల రాంబాబుతో పాటు ఎం.సత్యంనాయుడు, జోగి భుజింగరావు, రెడ్డి బలరాంస్వామి, లంక గోపాలం, టిడిపి సీనియర్ నాయకులు దాసరి రామరావు, మండలంలోని పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, మాజీ ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



భామిని పురవీధుల్లో నిర్వహిస్తున్న జయకృష్ణ విజయోత్సవ ర్యాలీ

ఉత్సాహంగా జయకృష్ణ విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - భామిని

కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ విజయోత్సవ ర్యాలీ భామిని, నేరడి లో ఆదివారం ఘనంగా సాగింది. తొలుత భామిని ప్రధాన కూడలిలో గల అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండలంలోని నేరడి, భామిని గ్రామాల్లో టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తల ఆధ్వర్యాన ఎమ్మెల్యే విజయోత్సవ ర్యాలీ ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణకు అడుగడుగున మహిళలు హారతి, పూలతో స్వాగతం పలికారు. కార్యకర్తలు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. తన తండ్రి నిమ్మక గోపాలరావు నుంచి ప్రస్తుత తన వరకు అండగా నిలిచిన కార్యకర్తలకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తోటపల్లి మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగరావు, టిడిపి మండల అధ్యక్ష ప్రధానకార్యదర్శులు రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు, భూపతి ఆనందరావు, బిడ్డిక ప్రసాద్, సర్పంచ్ లోపింటి రాజేశ్వరి, కోరాడ రాజేష్, పొట్నూరు నాగేశ్వరావు, ఎంపిటిసి బిడ్డిక విష్ణు, లోపింటి రాజేష్, కోరాడ రమణ, సాకేటి రామారావు, కృష్ణచంద్ర దొర, బిడ్డిక ప్రభాకర్, జనసేన సమన్వయ కర్త జానీ, టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సమస్యలు వివరించిన భాషా వాలంటీర్లు

ప్రజాశక్తి - సీతంపేట

తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసీ మాతృ బహు భాషా ఉపాధ్యాయులు పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు వినతిని అందజేశారు. తొలుత ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం బహు భాషా ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.డుంబు, జిల్లా అధ్యక్షులు ఆనందరావు, కార్యదర్శి ఎస్.మాసయ్య మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరానికి రెన్యువల్ గూర్చి వినతి పత్రం అందజేశామన్నారు. అలాగే సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, ప్రతి ఏటా జూన్ 12నాటికి ఉత్తర్వులు కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యను తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.



ఆందోళన చేస్తున్న సాలూరు పట్టణ వాసులు

విద్యుత్తు సరఫరా లేదని ఆందోళన

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని దండిగాం రోడ్డులో నివసిస్తున్న ఇళ్లకు రెండు రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో స్థానిక ప్రజలు ఆదివారం రాస్తారోకో చేపట్టారు. శుక్రవారం కురిసిన గాలివానకు పట్టణంలో పెద్దఎత్తున చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దండిగాం రోడ్డులో ఉన్న చెట్లు పూరిళ్ళపై కూలిపోవడంతో పేదలు తీవ్రంగా నష్టపోయారు. కూలిపోయిన చెట్ల కొమ్మలు కూడా తీయకుండా మున్సిపల్ అధికారులు అలాగే వదిలేయడం, విద్యుత్ సరఫరా లేక స్థానిక ప్రజలు రోడ్లపైకి వచ్చారు. ఆందోళన చేపట్టారు. రెండు రోజులుగా విద్యుత్ సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మున్సిపల్ సిబ్బంది అక్కడికి చేరుకుని కూలిన చెట్లను తొలగించారు. ఆదివారం సాయంత్రానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

బందలుప్పిలో యువత శ్రమదానం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని బందలుప్పి యువత ఆదివారం శ్రమదానం చేపట్టారు. ఆదివారం గ్రామంలో పాఠశాలలో ఎదురుగా ఎక్కువ చెత్త, పిచ్చి మొక్కలు ఉండడంతో యువత అందరు శ్రమదానం చేసి పాఠశాల ఆవరణ మొత్తం పరిశుభ్రంగా చేశారు. గత కొంతకాలంగా గ్రామంలోని చెరువులో వ్యర్థాలు పేరుకుపోవడంతో వర్షాకాలం వస్తే నీరు రోడ్డుపై చేరడాన్ని గమనించిన వారు చెత్తాచెదారాలను తీసి ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేశారు. గ్రామంలోని అపరిశుభ్రతపై స్పందించిన గ్రామానికి చెందిన యువతను గ్రామ పెద్దలు, నాయకులు అభినందించారు.

ఘాట్ రోడ్‌లో వాహనాల రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి - పాచిపెంట

ఆంధ్రా ఒడిస్సా ఘాట్ రోడ్డులో ఆదివారం వాహన రాకపోకలకు సుమారు నాలుగు గంటల పాటు అంతరాయం కలిగింది. ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో రోడ్డవలస-కంకణపల్లి గ్రామాల మధ్య గల ఘాట్ రోడ్డులో రెండు లారీలు మరమ్మతులకు గురై రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయాయి. దీంతో వాహనాల రాకపోకలకు సుమారు నాలుగు గంటల పాటు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంటనే సంఘటనా స్థలానికి ఎఎస్ఐ బి.ముసలయ్య పంపారు. ఆయనతో పాటు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని వాహనాల రాకపోకలను పునరుద్ధరించినట్లు తెలిపారు.



ఘాట్ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు



గతంలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీను

అన్న క్యాంటీన్ ప్రారంభానికి అడుగులు

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పట్టణంలోని జూనియర్ కాలేజీ రోడ్డులో గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ వైసిపి ప్రభుత్వం ఎత్తివేసి అందులో మున్సిపల్ ప్రజారోగ్య విభాగం కార్యాలయం -2 ను ఏర్పాటు చేశారు. అయితే మళ్లీ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమైన ఐదు సంతకాల్లో రాష్ట్రవ్యాప్తంగా పేదల కోసం అన్నా క్యాంటీన్ మళ్లీ తెరిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. ఇందులో భాగంగా పట్టణంలో బెలగాంలో ఉన్న అన్నా క్యాంటీన్ భవనంలో గల ప్రజారోగ్య విభాగం కార్యాలయాన్ని వేరే చోటికి తరలించారు. మళ్లీ అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవం చేసేందుకు ప్రభుత్వ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. పట్టణంలో మళ్లీ అన్నా క్యాంటీన్ ప్రారంభమైతే రోజువారీ పనుల కోసం పట్టణానికి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి, పేద ప్రజలకు తక్కువ డబ్బులకు తమ ఆకలి తీర్చుకునేందుకు అవకాశం ఉంటుందని పేదలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

జిఒ 117ను రద్దుచేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

విద్యా వ్యవస్థను గత ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని వెంటనే చక్కదిద్దే చర్యల్లో భాగంగా జీవో 117 రద్దు చేస్తూ ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయబడిన 3,4,5 తరగతులను వెంటనే వెనక్కి తీసుకురావాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన ఆ సంఘం కార్యవర్గ సమావేశంలో ఈ విషయాన్ని ఏకగ్రీవంగా తీర్మానించి ప్రభుత్వానికి పంపిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలోనే 1 నుంచి పదో తరగతి వరకు అన్ని తరగతుల్లోనూ సమాంతరంగా తెలుగు మాధ్యమంలో ప్రవేశించడానికి విద్యార్థులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు, ఎంవి గౌరీశంకర్, అప్పలనాయుడు, తిరుపతి, నరహరి, మురళి తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా ప్రయత్నం చేసుకుందామని తెలిపారు.

వైసిపి కార్యకర్తపై దాడి అమానుషం

డిప్యూటీ సిఎం రాజన్న దొర ఆగ్రహం

ప్రజాశక్తి - పాచిపెంట

వైసిపి కార్యకర్తలపై టిడిపి కార్యకర్తలు దాడులు చేస్తే సహించేదిలేదని మాజీ ఉపముఖ్యమంత్రి పి.రాజన్నదొర హెచ్చరించారు. పాచిపెంటకు చెందిన వైసిపి సోషల్ మీడియా కన్వీనర్‌గా పనిచేస్తున్న రౌతు సాగర్ రెడ్డి ఇంటికి టిడిపికి చెందిన సూర్యనారాయణ వెళ్లి దాడికి పాల్పడడం అమానుషమన్నారు. ఇంటికి వెళ్లి దాడి చేసి గాయపర్చడం న్యాయమా అని ప్రశ్నించారు. ఓవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో శాంతి యుతంగా పరిపాలన చేపడతామంటూ మరోపక్క వైసిపి కార్యకర్తలపై దాడులు చేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెడతామంటూ ఇలా దాడులు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. దాడులకు పాల్పడడమేనా మీరు ప్రేరేపిస్తున్న శాంతి అని మండిపడ్డారు. తాను నాలుగుసార్లు ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్నప్పటికీ ఏ రోజు కూడా ఇటువంటి దాడులను ప్రేరేపించలేదన్నారు. ఇటువంటి సంస్కృతి నియోజకవర్గంలో ఎప్పుడూ లేదన్నారు. తక్షణమే పోలీసులు దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలన్నారు. ఒక సీనియర్ నాయకుడిగా శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ఉండాలన్నదే ప్రధాన ఉద్దేశంతో తమ కార్యకర్తపై దాడి జరిగినప్పటికీ పరామర్శకు వెళ్లడంలేదని అన్నారు. పరామర్శకు వెళ్తే తన వెంట వందలా మంది కార్యకర్తలు వస్తారని, అప్పుడు శాంతిభద్రతల సమస్య ఏర్పడుతుందన్నారు. ఆ సమస్య తలెత్తకముందే నిందితుడిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులకు పాల్పడితే భయపడేది లేదని, మీరు యుద్ధం చేస్తే మేము కూడా యుద్ధానికి సిద్ధమేనని హెచ్చరించారు. కావున టిడిపి నాయకులు, కార్యకర్తలు భవిష్యత్తులో దాడులు మానుకోవాలని కోరారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాగర్‌రెడ్డి

18 నుంచి ఐటిఐ ప్రవేశాలకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - సాలూరు

ఈనెల 18 నుంచి 26 వరకు పార్వతీపురం మన్యం జిల్లాలో గల ప్రభుత్వ, ప్రయివేటు ఐటిఐల్లో ప్రవేశానికి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ వి.రవికుమార్ చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదోతరగతి జిపిఎ ర్యాంకు ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పించనున్నట్లు చెప్పారు. నిర్దేశించిన తేదీల్లో నిర్ణీత ధ్రువపత్రాలతో అభ్యర్థులు కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని జిల్లా కన్వీనర్ వి.రవికుమార్ ఒక ప్రకటనలో కోరారు.

అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా

జియ్యమ్మవలస : మండలంలోని విద్యుత్ వినియోగదారులకు రైతులకు సోమవారం నుంచి ఎలాంటి అంతరాయం లేకుండా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్‌శాఖ ఎఇ బి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం సంభవించిన గాలి, వర్షం కారణంగా ఎక్కడెక్కడైతే విద్యుత్ స్తంభాలు, వైర్లు డామేజ్ అయ్యాయో వాటన్నింటినీ పునరుద్ధరి స్తున్నట్టు తెలిపారు.

నాడు - నేడు పనులపై దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

నాడు-నేడు ద్వారా మండలంలోని చేపట్టిన పాఠశాలల పనులపై దర్యాప్తు వెంటనే చేపట్టాలని, అలాగే ప్రధానోపాధ్యాయులకు రావలసిన బకాయిలు వెంటనే చెల్లించాలని, పెండింగ్ పనులు పూర్తి చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలతో పాటు మంచి విద్యను అందించేందుకు ప్రతి స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించి, పాత బిల్డింగులన్నీ కొత్త బిల్డింగులుగా మారుస్తూ నాడు- నేడు కార్యక్రమం ద్వారా పనులు చేపట్టారన్నారు. ఈ పనులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడే ప్రధాన బాధ్యత వహిస్తూ కాంట్రాక్టుగా అవతారమెత్తి తన సొంత డబ్బులు పెట్టుబడిగా పెట్టి పనులు చేపడుతున్నారన్నారు. దీంతో ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం లక్షలాది రూపాయలు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. కావున హెచ్ఎంలకు బకాయిలు చెల్లించి అన్ని విధాలా ఆదుకోవాలని, విద్యార్థులకు మెరుగైన విద్య అందించేలా చర్యలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

పార్కులో సండే సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటకులు సండే సందడి చేశారు. పార్కులోని అందాలను ఆస్వాదించారు. జల విహార్ వద్ద బోటు షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచి వెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. చిన్నారులు ట్రైన్ ఎక్కి ఆడుకున్నారు. పిల్లలు బోటింగ్ చేశారు. యువకులు విలువిద్య ఎక్కు పెట్టారు. జెయింట్ వీల్ ఎక్కే ఉయ్యాల ఊగారు. ఆనంద్ విహార వద్ద డ్యాన్సులు వేశారు. ఆడాలి యు పాయింట్ కనువిందు చేస్తారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి జలగాలాడారు.



పార్కులోని సందడి చేస్తున్న చిన్నారులు

జిఒ 3 తీసుకొచ్చాకే డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలి

ప్రజాశక్తి - కురుపాం

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డీఎస్సీపై మొదటి సంతకం చేయడం హర్షించదగ్గ విషయమేనని, కానీ జిఒ 3ను అమలు చేసిన ఈ నోటిఫికేషన్ ఇవ్వాలని టిఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 16 వేల పోస్టులతో డిఎస్‌సి ప్రకటించడం చాలా ఆనందకరమైన విషయమే అయినప్పటికీ ప్రత్యేకించి ఆదివాసీ ప్రాంతంలో ఉన్న యువతకు జిఒ 3 ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. అలాగే ఐటిడిఎల్లో స్పెషల్ డిఎస్సీ నిర్వహించేలా గిరిజన ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

వీరఘట్టం ఎస్ఐగా కళాధర్

ప్రజాశక్తి - వీరఘట్టం



స్థానిక పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్గా జి కళాధర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పార్వతీపురం పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ ఐ ఎస్ కే ఫక్రుద్దీన్ మెడికల్ లీవ్ లో ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ జి కళాధర్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలకుండా ఉండేందుకు సహకరించాలని ప్రజలను కోరారు.

జిందాల్ సమ్మెకు కెవిపిఎస్ మద్దతు

ప్రజాశక్తి - కొత్తవలస

జిందాల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్ ఆదివారం సంపూర్ణ మద్దతు తెలిపారు. జిందాల్ యాజమాన్యం ఇప్పటికైనా స్పందించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు. జిల్లాలో ఫెర్రో పరిశ్రమలు పరిస్థితి అధ్వానంగా ఉందని ఆయన ఆందోళన చేశారు. యాజమాన్యాలు లే ఆఫ్ పేరుతో ఒక్కొక్క ఫ్యాక్టరీకి మూత వేస్తున్నారని, దీనివల్ల కార్మికులు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు జీవితాలతో యాజమాన్యాలు ఆటలాడడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిందాల్ కర్మాగారాన్ని భేషరతుగా లే ఆఫ్ ఎత్తివేసి కార్మికులందరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు గాడి అప్పారావు, జిందాల్ టిఎన్‌టియుసి అధ్యక్షుడు పిల్లా అప్పలరాజు, సలాది భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి పిఆర్‌టియు అభినందనలు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని పిఆర్‌టియు పార్వతీపురంమన్యం జిల్లా శాఖ అభినందనలు తెలిపింది. ఈ మేరకు సాలూరులోని మంత్రి స్వగృహానికి పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరాపు సూర్యనారాయణ ల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వాలేటి తవిటి నాయుడు, కాగాన విజయ్ వెళ్లి సంధ్యారాణికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి వారు సమస్యలను వివరించారు. జిఒ 117 రద్దుకు కృషి చేసి విద్యావ్యవస్థ బాగుకు కారకులు కావాలని, నూతన వేతన సవరణకు తొలి కేబినెట్‌లోనే ముఖ్యమంత్రి ద్వారా తీపి కబురు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనుదారులకు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమం లో రాష్ట్ర కార్యదర్శి జక్కు రామినాయుడు, గున్న రాజు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు భోగి రవికుమార్, మొయిద కృష్ణా రావు, ఐటిడిఎ విభాగం కన్వీనర్ సాకేటి దాలయ్య, లక్ష్మునాయుడు, అప్పారావు, సత్యనారాయణ, తదితరులు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వానికి సర్పంచుల మద్దతు

సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు మజ్జి రాంబాబు

ప్రజాశక్తి - రామభద్రపురం

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ఎన్‌డిఎ ప్రభుత్వానికి గ్రామ పంచాయతీ సర్పంచులు పూర్తి మద్దతు తెలుపుతున్నామని పంచాయతీ సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు మజ్జి రాంబాబు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందని, నిధుల లేమితో గ్రామ పంచాయతీల్లో ఎటువంటి అభివృద్ధి పనులూ చేపట్టలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి తరుణంలో అపార అనుభవసాలైన చంద్రబాబు ముఖ్యమంత్రిగా రావడం ఆనందంగా ఉందన్నారు. చంద్రబాబునాయుడు సారధ్యంలో రాష్ట్రం కొత్త పుంతలు తొక్కి అభివృద్ధి, సంక్షేమం పూర్తి స్థాయిలో జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నీతి, నిజాయితీలకు మారు పేరైన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు పంచాయతీరాజ్ శాఖ అప్పగించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజా సమస్యలపట్ల అవగాహనా, నిబద్ధత ఉన్న పవన్ సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు. ఇకనైనా పంచాయతీ వ్యవస్థ గాడిలో పడే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించి ప్రతినిదులంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి తమ సమస్యలు వివరిస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు ఇతర మౌళిక సౌకర్యాలు కల్పించి గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యంవైపు అడుగులు వేయాలన్నారు. అటవీ, పర్యావరణ కాలుష్యం పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేసి గ్రామ పంచాయతీలను కాలుష్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన షెడ్లు, చెట్లు

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో శనివారం రాత్రి వీచిన గాలులకు షెడ్లు, చెట్లు నేలకొరిగాయి. కార్యాలయానికి వచ్చిన ప్రజలకు సిబ్బందికి నీడ కొరకు ఏర్పాటు చేసిన షెడ్లు, ఆవరణలో ఉన్న చెట్లు నేలమట్టమయ్యాయి. ఆ సమయంలో సిబ్బంది లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కేజీపూడి, బక్కునాయుడుపేట గ్రామాలలో ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు వరిగిపోవడంతో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్తు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

విద్యుత్ శాఖకు రూ.15 లక్షల ఆస్తి నష్టం

శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షానికి రామస్వామిపేట, చినగుడిపాల, పేదగుడిపాల, వేపాడ గ్రామాలలో 15 విద్యుత్ స్తంభాలు నేల కూలిపోయాయి. దీంతో విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - సాలూరురూరల్



మృతి చెందిన ఆదినారాయణ (ఫైల్)

లారీ ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పాచిపెంట మండలం గురువునాయుడుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాలూరు మండలంలో లక్ష్మీపురానికి చెందిన రొంపల్లి ఆదినారాయణ (41) హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం ఆయన విధులు ముగించుకొని ఇంటికి వస్తుండగా లారీ ఢీకొని తీవ్రంగా గాయపడి, రోడ్డు పక్కన పడి ఉన్నాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న వైద్యశాఖ సిబ్బంది ఆయన్ను గమనించి అందుబాటులో ఉన్న వ్యాన్‌లో మామిడిపల్లి పిహెచ్‌సికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం సాలూరు సిహెచ్‌సికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఆయన భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదినారాయణ గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ పిహెచ్‌సిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ గురువునాయుడుపేట పిహెచ్‌సిలో డిప్యూటేషన్‌పై హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఎస్ఐ వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని లక్ష్మీ నారాయణ పురం శివారులో ఆదివారం పార్వతీపురం రూరల్ పోలీసులు దాడి చేసి 11 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.10020 స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్సై దినకర్ తెలిపారు.

తాటిపూడి జలాశయంలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని తాటిపూడి రిజర్వాయర్‌లో పడి ఆదివారం ఒక వ్యక్తి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న విఆర్ఓ గంట్యాడ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుడు చోడవరం గ్రామానికి చెందిన జలగొడుగుల నాగేశ్వరరావుగా గుర్తించారు. మృతుని భార్య వరలక్ష్మి కథనం ప్రకారం.. వేసవి సెలవులకు తాము ఎస్‌కోటలోని ఇంటికి వచ్చామని శుక్రవారం తన భర్త తాటిపూడి జలాశయం చూడడానికి వెళ్లి ఇంటికి రాకపోవడంతో అంతా గాలించామని చెప్పారు. దీంతో ఎస్.కోట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. మృతి చెందిన వ్యక్తి తన భర్త అని వరలక్ష్మి గంట్యాడ పోలీసులకు తెలియజేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేందర్ నాయుడు తెలిపారు.



తాటిపూడి జలాశయంలో తేలాడుతున్న నాగేశ్వరరావు మృతదేహం